ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి


ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న బల్దియా అధికారులు

చార్మినార్: ప్రజావాణిని పాతబస్తీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న కోరారు. ప్రతి సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. దాదాపు రెండున్నర గంటల పాటు అధికారులు ఫిర్యాదుల కోసం ప్రజావాణిలో ఉంటారని.. తమ ఫిర్యాదులను అందజేయవచ్చునన్నారు. ప్రజావాణిలో తమకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాల అధికారులతో పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు.

ఈసారి 6 ఫిర్యాదులు..

గత సోమవారం 14న, ఒక్క ఫిర్యాదు కూడా అందని విషయం తెలిసిందే. అయితే ఈ సోమవారం మాత్రం 6 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. తన పర్యవేక్షణలో ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాతబస్తీ సర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజావాణి కొనసాగుతుందని జోనల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. ఈ సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో చార్మినార్ జోన్ ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ విభాగం ఈఈ రామారావు, మేనేజర్(యూబీడీ) రఘునాథరెడ్డి తదితరులు పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు.

శ్మశాన వాటికకు విద్యుత్ స్తంభాలు మంజూరు


పూజలు చేస్తున్న కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్ తదితరులు

చాంద్రాయణగుట్ట: నల్లవాగు హిందూ శ్మశాన వాటికలో వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించి పది విద్యుత్ స్తంభాలు మంజూరు చేయడం హర్షణీయమని గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు విద్యుత్ స్తంభాలకు బ్యాగరీ సంఘం నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శ్మశాన వాటికలో దశలవారీగా సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. తాము విన్నవించిన వెంటనే అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ బ్యాగరీ సంఘం అధ్యక్షుడు పేరోజీ సాయినాథ్, ప్రతినిధులు సాయిలు, జయలక్ష్మీ, సత్తెమ్మ, సురేందర్, వీరేందర్, భగీరథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేసిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంజేపీ మిల్క్ ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ గౌస్ అన్నారు. గత వారం గోల్కొండ జ్యూరిచ్ పాఠశాలలో సికిల్ సెల్ సొసైటీ వారు నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి సోమవారం ఆయన ప్రశంసాపత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ..రక్తదానం చేసిన వారిలో 50 శాతం కంటే పైగా యువకులే ఉన్నారన్నారు. స్థానికుల నుంచి వచ్చిన స్పందనను దృష్టిలో పెట్టుకొని ముందు ముందు మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. సీనియర్ మజ్లిస్ నాయకులు ఏ.కే.పటాన్, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్, మునావర్ తదితరులున్నారు.

తెలంగాణ సకల కళా సమ్మేళనం


కళాకారులతో కేవీ.రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రం సకల కళల సమ్మేళనమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో సర్వ కళాకారుల సంక్షేమ వేదిక తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ, జానపద కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలువురు కళాకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా పలువురు నృత్య గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వర్‌రావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, ఎల్ఐసీ ప్రతినిధి వి.సుబ్రమణ్యం, యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, సంఘం అధ్యక్షులు, కార్యదర్శి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

‘సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు నమ్మొద్దు’


మాట్లాడుతున్న ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్

గౌలిపురా: సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు ప్రజలు నమ్మొద్దని ఛత్రినాక ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్ సూచించారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి పోస్టులను కూడా ప్రజలు వైరల్ చేయకూడదన్నారు. ఒకవేళ ఇతరులకు షేర్ చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్తీలు, కాలనీలు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని.. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు పరుగు


సూర్యనగర్ కాలనీలో పారుతున్న మురుగు

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లోని సూర్యనగర్ కాలనీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అత్యంత రద్దీగా ఉండే టోలిచౌకి చౌరస్తాను ఆనుకొని ఉన్న ఈ కాలనీ సమస్యల పుట్టగా మారింది. ఏ రోడ్డుపై చూసినా మురుగు ప్రవహించడమే కాకుండా రోడ్డు పక్కన చెత్త కుప్పలు గుట్టల్లా పడి ఉన్నాయి. కాలనీలోని రవీంద్ర భారతీ పాఠశాల ముందు గల రోడ్డు మురుగు ప్రవాహంతో దుర్గంధంగా మారింది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులే కాకుండా కాలనీలో రాకపోకలు సాగించే పాదచారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

హెచ్ఐవీపై అవగాహన సదస్సు



గోల్కొండ: హెచ్ఐవీ ఆరోగ్యానికి కాకుండా సమాజానికి కూడా హానికరమని గోల్కొండ ఏరియా ఆసుపత్రికి చెందిన రుక్సానా అన్నారు. శనివారం గోల్కొండ బీజేఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు హెచ్ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్ఐవీని సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం దృఢనిశ్చయంతో ఉందన్నారు. ఇందులో భాగంగా సమాజంలోని ప్రతి ఒక్కరికి వ్యాధి నియంత్రణ, వ్యాప్తి, ఆరోగ్య సమస్యలు తదితర వాటిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల విద్యార్థినులు హెచ్ఐవీపై వల్ల ప్రమాదాలను తమ పరిసరాల్లోని వారికి వివరించాలన్నదే తమ లక్ష్యమని ఆమె అన్నారు. ప్రిన్సిపాల్ జి.మాధవి మాట్లాడుతూ..ఎయిడ్స్ నివారణ సంస్థకు ప్రతి విద్యార్థి ముందుకు వచ్చి అంబాసిడర్లుగా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు చెందిన దిలీప్‌కుమార్, కళాశాల అధ్యాపకులు ప్రణిత, ముబీనా, హర్షియా, రిజ్వానా, మసుద ఉన్నారు.

అటకెక్కిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు

సిటీ కాలేజీ చౌరస్తా నుంచి పురానాపూల్ మీదుగా బహదూర్‌పురా వరకు ప్రణాళికలు

- దక్షిణ మూసీ ప్రాంతంలో కీలకమైన ప్రధాన రోడ్డు
- పాతబస్తీ నుంచి నగరంలోని ఇతర ప్రాంతాలకు అనుసంధానం
- పరిశీలనకే పరిమితమైన ఫ్లైఓవర్ పనులు
- సాంకేతిక కారణాలతో కార్యరూపం దాల్చని వైనం


సిటీ కాలేజీ చౌరస్తాలో..

చార్మినార్: పాతబస్తీ నయాపూల్–మదీనా సర్కిల్ నుంచి వెళ్లే పురానాపూల్ రహదారిలో ట్రాఫిక్ సమస్యలను నివారించడానికి ఇప్పటికే బహదూర్‌పురా చౌరస్తా వద్ద ఒక ఫ్లై ఓవర్ నిర్మించగా.. జూ పార్కు నుంచి ఆరాంఘర్ వరకు మరో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో ఉంది. ఇక సిటీ కాలేజీ చౌరస్తా నుంచి పురానాపూల్ దర్వాజా ద్వారా పురానాపూల్ హిందూ శ్మశాన వాటిక అవతల అంటే.. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన బహదూర్‌పురా ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు మరో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉండగా.. ఆ పనులు పలు సాంకేతిక కారణాలతో కార్యరూపం దాల్చలేదు. కేవలం క్షేత్ర స్థాయి పరిశీలనకే పరిమితమయ్యాయి. మదీనా సర్కిల్ నుంచి ఆరాంఘర్ వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా భారీ వాహనాలతో సహా ట్రాఫిక్ సాఫీగా కొనసాగడానికి ఈ రూట్‌లోని సిటీ కాలేజీ చౌరస్తా నుంచి పురానాపూల్ వరకు నిర్మించ తలపెట్టిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పాతబస్తీలో పరేషానే..

హైదరాబాద్ నగరాన్ని మూసీ నది రెండు భాగాలుగా విభజించింది. ఉత్తర మూసీ ప్రాంతం, దక్షిణ మూసీ ప్రాంతం. ఇలా ఉత్తర మూసీ ప్రాంతమైన అఫ్జల్‌గంజ్ నుంచి మూసీ నది దాటి నయాపూల్‌కు అడుగుపెడితే చాలు.. వాహనదారులు నరకాన్ని చవి చూడాల్సి వస్తోంది. మూసీ నదికి అవతల వైపు నుంచి ఇవతల వైపున ఉన్న పాతబస్తీలో ఎప్పుడు చూసినా ట్రాఫిక్ క్లియర్‌గా ముందుకు వెళ్లని పరిస్థితులుంటాయి. అసలే బాటిల్ నెక్ రోడ్లు.. దీనికి తోడు అడ్డదిడ్డంగా పార్కింగ్.. ఎవరు ఎటువైపు వెళ్తున్నారో తెలియని అయోమయ పరిస్థితులు ఇక్కడ ఎదురవుతున్నాయి. నయాపూల్ నుంచి మదీనా సర్కిల్, హైకోర్టు రోడ్డు ద్వారా బెంగళూర్ జాతీయ రహదారి సైతం ఇక్కడి నుంచి వెళ్తుండడంతో ఈ రోడ్డుపై అన్ని రకాల వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. మదీనా సర్కిల్ నుంచి ఆరాంఘర్ వరకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఉండేందుకు అవసరమైన చోట ఫ్లై ఓవర్ బ్రిడ్జీల నిర్మాణాలకు రూప కల్పన చేసింది. ఇందులో భాగంగా సిటీ కాలేజీ చౌరస్తా నుంచి పురానాపూల్ మీదుగా బహదూర్‌పురా వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి బల్దియా ప్రణాళికలు రూపొందించింది. అయితే ఇప్పటి వరకు కార్యరూపం దాల్చ లేదు.

నిత్యం ట్రాఫిక్ సమస్యలు..

నయాపూల్–మదీనా చౌరస్తా నుంచి హైకోర్టు దాటగానే ముందుగా వచ్చే ఏరియా సిటీ కాలేజీ చౌరస్తా. ఇక్కడి నుంచి నగరంలోని ఇతర ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు వెళ్లే ప్రధాన రోడ్డు. ఇక్కడి నుంచి పేట్లబురుజు సీఏఆర్ హెడ్ క్వార్టర్స్, పేట్లబురుజు ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పీటీఓ, పురానాపూల్ దర్వాజ ద్వారా పురానాపూల్ హిందూ శ్మశాన వాటిక నుంచి ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన బహదూర్‌పురా ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు నిర్మించాల్సి ఉంది. ఇందుకోసం గతంలో జీహెచ్ఎంసీ ప్రణాళికలు రూపొందించి కార్యాచరణకు రూప కల్పన చేసింది. అయితే ఈ రోడ్డులో వివాదాస్పదంగా మారే ప్రాపర్టీస్ అధికంగా ఉండడంతో పాటు పురానాపూల్ హిందూ శ్మశాన వాటిక వద్ద రోడ్డు బాటిల్ నెక్ గా ఉండడంతో అధికారులు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. పురానాపూల్ దర్వాజ చౌరస్తాకు అనుసంధానంగా ఉన్న పురానాపూల్ బ్రిడ్జిపై నుంచి జియాగూడ, కార్వాన్ తదితర ప్రాంతాలకు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉంటాయి.

‘పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను దగా చేసింది’


గౌరీ సతీష్

అఫ్జల్‌గంజ్: గతంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను దగా చేసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క రైతుకైనా రైతు రుణమాఫీ ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతుబంధు, రైతు రుణమాఫీ సకాలంలో రైతులందరికీ ఇస్తుండడంతో జీర్ణించుకోలేని బీఆర్ఎస్ అగ్ర నాయకులు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు దిగజారుడుగా వ్యవహరిస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలు, నిరుద్యోగులు సుఖ సంతోషాలతో ఉంటే బీఆర్ఎస్ తట్టుకోలేకపోతుందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా గ్రూప్–1 అభ్యర్థులు ఎదురుచూస్తున్న కలలు నిజం చేస్తున్న ఘనతరేవంత్‌రెడ్డికే దక్కుతుందని గౌరీసతీష్ అన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఈ నెల 23 నుంచి కార్వాన్‌లో పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకి మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పరిశుభ్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజల సహకారం ఉంటేనే రోగాల వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. బల్దియా, జలమండలి అధికారుల సమన్వయంతో ఈ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజలు సైతం తమవంతు సహకారం అందించాలని, దీనిపై మజ్లిస్ నాయకులు, కార్పొరేటర్లు ముందుగానే ప్రజలకు తెలియజెప్పి వారి సహకారం కూడా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అలీముద్దీన్, హబీబ్‌చౌష్ తదితరులున్నారు.

‘దేవునికుంట శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పిస్తా’


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

విజయనగర్‌కాలనీ: దేవునికుంట హిందూ శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పిస్తానని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక నాయకుడు నాగేష్‌తో కలిసి సందర్శించారు. దీపావళిని పురస్కరించుకొని శ్మశానవాటికలో ప్రజలు పెద్ద ఎత్తున తమ పూర్వీకుల సమాధులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, వారికి ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా పనులు పూర్తి చేస్తామన్నారు. శ్మశాన వాటికలో విధులు నిర్వహించే నాగరాజు ఇక్కడ నెలకొని ఉన్న స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీపావళి నాటికి చెట్లకొమ్మలు, పనికిరాని చెట్లు తొలగించాలని ఈఈ లాల్‌సింగ్‌కు సూచించారు.

ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం


నివాళులర్పిస్తున్న రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ తదితరులు

అబిడ్స్: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల అమరవీరులకు బీజేపీ రాష్ట్ర కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, రాష్ట్ర నాయకుడు కిషన్ ప్రసాద్ నివాళులర్పించారు. గోషామహల్‌లోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద వారు అమరవీరులైన పోలీసులకు నివాళులర్పించి వారు రక్షణ కోసం చేసిన త్యాగాలను కొనియాడారు.

రక్తదానంపై సమాజంలో అవగాహన పెరగాలి..

గోల్కొండ: సమాజంలో రక్తదానంపై అవగాహన పెరగాలని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ ఆధ్వర్యంలో సోమవారం గోల్కొండలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసీమియా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుందని వారికి ప్రతినిత్యం ఎంతో రక్తం అవసరం ఉందన్నారు. దివ్యాంగుడైన మహ్మద్ జాహెద్ అలీ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ పీస్ అంబాసిడర్ మహ్మద్ నజీబ్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణాన్ని కాపాడుతుంది..

లంగర్‌హౌస్: రక్తదానం నిండు ప్రాణాన్ని కాపాడుతుందని లంగర్‌హౌస్ బాపూఘట్ మఠం పీఠాధిపతి సంత్‌రాహుల్‌దాస్ బాబా అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం లంగర్‌హౌస్ డిఫోర్ట్ ఫంక్షన్‌హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంత్ రాహుల్‌దాస్ బాబా స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. డీసీపీ సయ్యద్ ఫయాజ్, లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్, ఎస్సైలు రాఘవేంద్రస్వామి, రాజుతో పాటు మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.


జాహెద్ అలీని అభినందిస్తున్న సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్


లంగర్‌హౌస్‌లో రక్తదానం చేస్తున్న సంత్‌రాహుల్‌దాస్ బాబా

26, 27 తేదీల్లో టైగర్ ఇండియా ఖేలో ఫుట్‌బాల్ సీజన్-4



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

అఫ్జల్‌గంజ్: టైగర్ ఇండియా ఖేలో ఫుట్‌బాల్ (ఐకేఎఫ్) సీజన్–4 ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. ఇండియా ఖేలో ఫుట్‌బాల్ (ఐకేఎఫ్), టైగర్ క్యాపిటల్, హైదరాబాద్ లిటిల్‌స్టార్స్ సాకర్ అకాడమీ, సౌత్‌క్లాన్ ఫుట్‌బాల్ క్లబ్‌తో జతకట్టి గోల్కొండ కోట వెనుక ఉన్న ఆర్టిలరి సెంటర్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. తెలంగాణలో ఫుట్‌బాల్‌ను విప్లవాత్మకంగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఫుట్‌బాల్ పట్ల ఆసక్తి కనబరిచే విధంగా ఫుట్‌బాల్‌పై క్రీడాకారులు ప్రతిభ చాటే విధంగా ఈ పోటీలు చేపడుతున్నామన్నారు.

పాలాభిషేకం



నాంపల్లి: సీనియర్ కాంగ్రెస్ నేత మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ చిత్రపటానికి భోజగుట్టవాసులు పాలాభిషేకం చేశారు. స్థానికంగానే పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని వాగ్దానం చేసిన సందర్భంగా శ్రీరామ్‌నగర్, శివాజీనగర్, వివేకానందనగర్ వాసులు హర్షం వ్యక్తం చేశారు. వాగ్దానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివాజీ నగర్ అధ్యక్షులు రవి, ఏ బ్లాక్ అధ్యక్షులు జి.వెంకటేష్, నేతలు బాబా గౌడ్, ప్రవీణ్ కుమార్, నర్సింహా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బుర్రా వెంకటేశంను కలిసిన ‘వెలుదండ’



నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం తెలుగు సాహిత్యానికి సంబంధించిన పలు పుస్తకాలను అందజేశారు.

సన్మానం



అఫ్జల్‌గంజ్: వ్యవసాయ శాఖ చైర్మన్‌గా నియమితులైన కోదండ రెడ్డిని ఎమ్మెల్యే దానం నాగేందర్, గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు సంతోష్‌గుప్తా, ఏనుగుల వినోద్ కుమార్, నాగభూషణం ఘనంగా సత్కారం చేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల పక్షపాతిఅని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ భీశ్వ సురేఖ, భీశ్వ ఓంప్రకాష్

అబిడ్స్: సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ భీశ్వ ఓంప్రకాష్, రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాష్ పేర్కొన్నారు. బషీర్‌బాగ్, గన్‌ఫౌండ్రీ ప్రాంతాల్లో బీజేపీ సభ్యత్వం నిర్వహించారు. అనంతరం జరిగిన ఎస్సీ మోర్చా సమావేశంలో వారు ప్రసంగిస్తూ..సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో పెద్ద ఎత్తున ప్రతిరోజూ అక్రమంగా సమావేశమైన వారి పట్ల ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. నగరంలోనే కాక పలు ప్రాంతాల్లో ఆలయాలపై కొంతమంది పనికట్టుకొని దాడులు చేస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం లేదన్నారు. ప్రజలంతా ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించదలన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే తెలంగాణ రాష్ట్రం శాంతి సామరస్యంగా ఉంటుందన్నారు.